01 page 18_01 page 18.qxd 17-06-2026 PM 10:36 Page 1

శ్రీశైలం డ్యాంకు..
నీటిచేరికలు

శ్రీశైలంప్రాజెక్ట్, జూన్17,ప్రభాతవార్త

శ్రీశైలం డ్యాంకు నుంకేసుల నుండి నీటి చేరికలు ప్రారంభం అయ్యాయి.శ్రీశైలం జలాశయంకు ఉదయం 6గంటల సమయానికి నుంకేసుల నుండి ఇన్‌ఫ్లో 6,710 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతుంది.ఈక్రమంలోనే శ్రీశైలం రిజర్వయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా డ్యాం నీటినిల్వ సామర్థ్యం 215 టియంసిలుగా ఉంటుంది.బుధవారం ఉదయం సమయానికి 821.20 అడుగులుగా ఉండగా నీటి నిల్వసామర్థ్యం 41.6978 టియంసిలుగా నమోదు అయింది.శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో ఎటువంటి ఉత్పత్తి జరగడంలేదు.

కర్నూలు | నంద్యాల

వార్త

18 జూన్ 2026 గురువారం, పేజీలు 4

వ్యవసాయరంగంలో.. రాణించాలి

- యూరియాతో పాటు లింక్ ఎరువులను కొనుగోలు చేయాలని బలవంతపెడితే కఠిన చర్యలు తప్పవు
- రైతులకు అవసరమైన ఎరువులను మాత్రమే విక్రయించాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

2లో

దేవనకొండ, జూన్ 17, ప్రభాతవార్త:

రైతులు వ్యవసాయ రంగంలో రాణించాలని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పిలుపు నిచ్చారు. బుధవారం మండలం లోని కరివేముల గ్రామంలో సదా శివరావు అనే రైతు హై-డెన్సిటీ ప్లాంటేషన్ కింద చేస్తున్న మామిడి పంటను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల ద్వారా పంటను సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. అలాగే మండలకేంద్రంలో బడిగింజల రంగన్న అనే రైతు 16 ఎకరాల్లో సాగు చేస్తున్న హైబ్రిడ్ కొబ్బరి తోటను, మిశ్రమ, అంతర పంటల విధానాలను పరిశీలించారు. మిశ్రమ మరియు అంతర పంటల విధానాలతో రైతులకు ఆదాయం చేకూరుతుందన్నారు. అంతర పంటల సాగు, మైక్రో ఇరిగేషన్ సాగును ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు..



2లో

టీసీల కోసం..
తల్లిదండ్రుల కన్నీరు..!

- ఫీజులు చెల్లించిన టీసీలు ఇవ్వని ప్రైవేట్ పాఠశాలలు
- పుస్తకాలు, యూనిఫాంల పేరుతో దోపిడి

తుగ్గలి,జూన్ 17,ప్రభాతవార్త:

విద్యార్థుల భవిషత్తుకు బాటలు వేయాల్సిన విద్యాసంస్థలే కొందరి చేతుల్లో ఆదాయ వనరులుగా మారుతున్నాయనే ఆరోపణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మండల కేంద్రమైన తుగ్గలిలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను టీసీల కోసం, ఆన్‌లైన్లో నమోదు తొగించక తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ పిల్లల ఫీజులను పూర్తిగా చెల్లించినప్పటికి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు(టీసీ) ఇవ్వకుండా పాఠశాల యాజమాన్యం కాలయాపన చేస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారాలనుకునే విద్యార్థులకు టీసీ అత్యంత కీలకమైన పత్రం అయినప్పటికి దానిని

చౌకగా కొట్టేసి..
చాటుగా.. దాచేసి..!

- : పక్కదారి పడుతున్న పేదల బియ్యం
- : పీడీయాక్ట్ నమోదు చేయకుండా మీనమేషాలు
- : అవకాశం ఉన్నా పట్టించుకోని అధికారులు
- : ఇదే అలుసుగా తీసుకుంటున్న అక్రమార్కులు
- : పట్టించుకోని రెవిన్యూ., పోలీసు అధికారులు..!



ఎమ్మిగనూరు క్రైం, జూన్ 17 ప్రభాతవార్త :

లిక్కర్ మాఫియా, ఇసుక, గ్రావెల్ మాఫియా గురించి వినుంటారు. ఇప్పుడు రేషన్ మాఫియా వచ్చింది. రకరకాల మార్గాల్లో పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఎన్ని తనిఖీలు చేసినా.. రేషన్ మాఫియాపై ఎన్ని కేసులు పెట్టినా.. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. నిన్నటి వరకు డీలర్ల నుంచి రేషన్ మాఫియా బియ్యాన్ని సేకరించి అక్రమంగా తరలించేది. ఇప్పుడు ఓ డీలర్లే రేషన్ మాఫియా అవతారమెత్తాడు. పోలీసు, రెవిన్యూ శాఖ అధికారులతో సంబంధాలు కొనసాగిస్తూ.. చౌక బియ్యాన్ని నల్ల బజారుకు అక్రమ రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉచితంగా ప్రభుత్వం అందించే బియ్యంకు అధిక ధర ఆశ చూపి కార్డుదారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం అందించే బియ్యం నాసిరకమంటూ ప్రచారంతో చీకటి వ్యాపారాన్ని పెంచుకుంటు న్నారు. పగలంతా సేకరించిన దర్జాగా వాహనాలపై తరలిస్తున్నారు. ఎవరి పర్సంటేజ్ వారికి అందించాం.. మాకేంటి భయ్యా అంటూ నిర్భీతితో బియ్యాన్ని సేకరించి తరలిస్తున్నారు. కళ్ల ముందే అంతా జరుగుతున్నా వారిపై

2లో

రోడ్డు ప్రమాదంలో.. వృద్ధుడు మృతి

: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న దుర్ఘటనలో ఒకరు మృతి..

వెల్దుర్తి,జూన్ 17, ప్రభాతవార్త :

44వ జాతీయ రహదారిలోని టోన్ మార్గంలో ఉన్న రైల్వే గేట్ల సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోతులూరి ఆచారి (65)అనే వ్యక్తి మృతి చెందాడు. లక్ష్మీనగరం గ్రామానికి చెందిన ఇతను కొంతకాలంగా వెల్దుర్తిలో నివాసం ఉంటున్నాడు. పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై టోన్ కు వెళుతుండగా బెంగళూరుకు వెళ్తున్న మరో బైకు ఇతని ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఇతనిని చికిత్స నిమిత్తం వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ వైద్య చికిత్సలు పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఈ ప్రమాదంపై వెల్దుర్తి పోలీసులు విచారణ చేపట్టారు

కొత్త విద్యా సంవత్సరానికి.. సమగ్ర ఏర్పాట్లు

- : బి.ఫా. ఎకనామిక్స్ (ఆనర్స్), బి.ఫార్మసీ కోర్సుల ప్రారంభానికి చర్యలు
- : నాక్ రీఅక్రిడిటేషన్ కోసం ముమ్మర ప్రయత్నాలు
- : క్యాంపస్ అంతటా వైఫై, డిజిటల్ బోర్డులు, ఆధునిక ల్యాబ్‌ల ఏర్పాటు
- : విమర్శలను ఖండించిన యూనివర్సిటీ యాజమాన్యం

కర్నూలు, జూన్ 17, ప్రభాతవార్త :

రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అధునాతన సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు రాయలసీమ యూనివర్సిటీ సిద్ధంగా ఉందని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి. వెంకట బసవరావు తెలిపారు. ఇప్పటికే యూనివర్సిటీలో చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని, అదే స్థాయిలో భవిష్యత్ తరాల విద్యార్థులను మరింత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ఆధునిక విద్యా విధానాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం యూనివర్సిటీ సెనేట్ హాలులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో రెక్టార్ ఆచార్య ఎన్.టి.కె. నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి. విజయ్ కుమార్ నాయుడుతో కలిసి ఆయన మాట్లాడారు. రానున్న విద్యా సంవత్సరంనుంచి నాలుగేళ్ల బి.ఏ. ఎకనామిక్స్ (ఆనర్స్), బి.ఫార్మసీ కోర్సులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యూనివర్సిటీకి ఐఎస్ఓ 4 స్టార్ రేటింగ్ లభించిందని వెల్లడించారు. 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న నాక్ అక్రిడిటేషన్ ప్రక్రియను తిరిగి ప్రారంభించామని, రీఅక్రిడిటేషన్ పొందుతామన్నారు. ఇందుకోసం నిపుణుల సలహాలు, సహకారం కూడా తీసుకుంటున్నామని వివరించారు. యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల సముదాయం అభివృద్ధిలో భాగంగా రెండు అదనపు భవనాల నిర్మాణంతో పాటు సివిల్, మెకానికల్ వర్క్‌షాప్‌ల కోసం పెద్ద నిర్మాణ పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. సిబ్బంది హాజరు పర్యవేక్షణ కోసం ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ ను పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామని, జూలై 1 నుంచి పూర్తిస్థాయిలో అమలులోకి తీసుకురానున్నామని వెల్లడించారు. ఇదే విధానాన్ని

మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు ఖండనీయం

కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ

కర్నూల్ హాస్పిటల్ జూన్ 17 ప్రభాతవార్త :

హోంమంత్రి శ్రీమతి అనిత పై వైసీపీ నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలను కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ తీవ్రంగా ఖండించారు. మహిళలను గౌరవించాలని చెప్పే నాయకులు తమ పార్టీ నేతల వ్యాఖ్యలపై మౌనం పాటించడం బాధాకరమని ఆమె అన్నారు. మహిళల గౌరవం విషయంలో వైసీపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. మహిళలపై అవమానకర వ్యాఖ్యలు జరిగిన ప్రతిసారి స్పందించకుండా ఉండటం ఆ పార్టీ సంస్కృతిని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా వ్యక్తిగత దూషణలు, అసభ్య వ్యాఖ్యలతో రాజకీయాలు చేయడం దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని ఆది కృష్ణమ్మ అన్నారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వారిని ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా తగిన విధంగా బుద్ధి చెబుతారని ఆమె హెచ్చరించారు.

పడకల గ్రామాభివృద్ధికి.. శ్రీకారం..!

- రూ. 75 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమి పూజ
- -ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ

ఆళ్లగడ్డ, జూన్ 17, ప్రభాతవార్తః

ఆళ్లగడ్డ మండల పరిధిలోని పడకల గ్రామంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ శ్రీకారం చుట్టారు. బుధవారం గ్రామంలోని కాశిరెడ్డి నాయన టెంపుల్ నుండి సిఎస్ఐ చర్చి వరకు రూ.75 లక్షల వ్యయంతో 900 మీటర్ల సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ మాట్లాడుతూ పడకండ్ల గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచుస్తున్న రహదారి, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేదిశగా ఈపనులు చేపట్టామన్నారు. మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య వసతులు కల్పించడం ద్వారా గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వ గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు కనీస వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నియోజకవర్గంలో ప్రతిగ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషిచేస్తామని ప్రజల అవసరాలకనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో పడకండ్ల టీడీపీ నాయకులు బద్రి సుధాకర్‌రెడ్డి, పాంపల్లె మద్దిలేటి, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో 20 లక్షల కోట్ల పెట్టుబడులు

కర్నూల్ హాస్పిటల్ జూన్ 17 ప్రభాతవార్త :

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం బండపురంలో బి.ఆర్.వి.ఐ.ఎల్ క్యాంపా ష్యూర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ప్రారంభించిన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కూటమి ప్రభుత్వం రెండేళ్లలో 20 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం బండపురంలో బోద రిత్విక్ వెంచూర్స్ ప్రైవేట్ లిమిటెడ్ క్యాంపా ష్యూర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ప్లాంట్ యజమానులు మంత్రి, ఎమ్మెల్యేకు ప్లాంట్ గురించి వివరించారు. అనంతరం మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ 90 రోజుల్లో ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా 150 మందికి, పరోక్షంగా 200 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తమ ప్రభుత్వంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అమలు చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కృషితో దేశంలోకి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. రిలయన్స్ కంపెనీ రాష్ట్రానికి రావడంతో దానికి అనుబంధంగా చాలా యూనిట్స్ ఏర్పాటవుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ స్థానికంగా ఇలాంటి కంపెనీలు రావడం సంతోషంగా ఉందన్నారు. పెట్టుబడిదారులకు తమ సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. ప్లాంటును మరింత విస్తరించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, మంత్రి టీజీ భరత్ నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా దూసుకువెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ప్రతినిధులు ఆర్పన్ బసు, ప్రథమేష్ మెహ్రా, రాకేష్‌శర్మ, ఎం.డి కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్ల నమ్మకం అభివృద్ధి,సంక్షేమం కార్యక్రమం ఘన విజయం

: మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి

నంద్యాల, జూన్ 17 ప్రభాతవార్త ప్రతినిధి

ప్రతి అర్హత కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మరియు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డిలు అన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డు ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, పాణ్యం, ఆత్మకూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు,జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఎస్పీ సునీల్ షోరాన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. జిల్లా పరిపాలన యంత్రాంగం సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని

తెలిపారు. రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మరియు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. యువత ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు చేపట్టడంతో పాటు విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పిస్తూ కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, నంద్యాల జిల్లా ఆర్థికాభివృద్ధికి వ్యవసాయం, అనుబంధ రంగాలే ప్రధాన ఆధారమని, జిల్లా స్థూల ఆర్థికోత్పత్తి (జీడీపీ)లో దాదాపు 45 శాతం వాటా ఈ రంగాల నుంచే లభిస్తోందని తెలిపారు. గత రెండేళ్లలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా 2.06 లక్షల మంది రైతులకు సుమారు రూ.400 కోట్ల ఆర్థిక సహాయం అందిందన్నారు. విత్తనాలు, ఎరువులు, ఇతర సబ్సిడీల రూపంలో వ్యవసాయ రంగానికి రూ.430 కోట్ల మద్దతు లభించిందని చెప్పారు.

నంద్యాల పట్టణ కేంద్రంలో నిర్వహించిన.. యోగాంధ్ర కార్యక్రమం

నంద్యాల జూన్ 17 ప్రభాతవార్త ప్రతినిధి :

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర2026 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం నంద్యాల ఇండోర్ స్టేడియం ఆవరణలో యోగాంధ్ర అసోసియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా సాధన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా గారు, జాయింట్ కలెక్టర్ శ్రీ సూరజ్ ధనుంజయ్ గారు, జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ గారితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు.యోగా నిపుణుల సూచనల మేరకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యాన సాధన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ గారు మాట్లాడుతూ... యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఒత్తిడి తగ్గి ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సూచనలతో ఆరోగ్యకరమైన ఆనందకరమైన సమాజాన్ని నిర్మించడం కొరకు మనమందరం ప్రతిరోజు తప్పనిసరిగా యోగా చేస్తూ ఆరోగ్యవంతంగా జీవనం సాగించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో యోగా సాధకులు, విద్యార్థులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా యోగాభ్యాసం చేశారు. యోగాంధ్ర2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా అధికారులు పిలుపునిచ్చారు.

అప్పుల బాధతో.. రైతు ఆత్మహత్య

- రైతుకు రూ.10 లక్షలు అప్పులు
- రైతు కుటుంబాన్ని ఆదుకోవాలంటున్న గ్రామస్తులు

మంత్రాలయం, జూన్ 17, ప్రభాతవార్త;

నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయం పోలీస్‌స్టేషన్ పరిధిలో వగరూరు గ్రామంలో అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల మేరకు... గ్రామానికి చెందిన రెహమాన్(40) అనే రైతుకు సుమారు రూ.10 లక్షలు అప్పులు ఉన్నాయి. అయితే ఈ అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతి చెందిన రైతుకు భార్య సలీమ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను సమగ్రంగా చేపట్టాలి..

: పి.రామచంద్రయ్య..

పత్తికొండ, జూన్ 17, ప్రభాతవార్త : ఎస్ ఐ ఆర్ ప్రక్రియను సమగ్రంగా చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్ ఐ ఆర్ ద్వారా అర్హులైన ఓటర్లను ఓటరు జాబితా నుండి తొలగించేందుకు కుట్రలు పడుతోందని విమర్శించారు. ఎస్ ఐ ఆర్ పేరుతో ఇప్పటికే దేశవ్యాప్తంగా 6 కోట్ల 50 లక్షల అర్హులైన ఓటర్లను ఓటరు జాబితా నుండి తొలగించడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నడూ లేని విధంగా బిజెపి ప్రభుత్వం కేంద్ర ఎన్నికల కమిషన్ తో కుమ్మక్కై ఓటరు జాబితా నుండి మైనార్టీలు, ఆదివాసీలు, దళితులను అధిక సంఖ్యలో తొలగిస్తూ, బిజెపికి అనుకూలంగా లేని ప్రతిపక్ష పార్టీల ఓట్లను సైతం తొలగించేందుకు పూనుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి బహిరంగంగా ఓటరు జాబితాలో పేర్లను చదివి వినిపించి అర్హత లేని వారి ఓట్లు తొలగించాలన్నారు. పట్టణాలు, గ్రామాలలో 18 సంవత్సరాలు పైబడిన వయోజనులను గుర్తించి ఓటరు నమోదు ప్రక్రియను సమగ్రంగా నిర్వహించాలన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో అక్రమంగా ఓట్లను తొలగించే విధానాన్ని తమ పార్టీ నేతృత్వంలో క్షేత్రస్థాయిలో బిఎల్ఏ లను నియమించి అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి యు. కారుమంచి, పట్టణ కార్యదర్శి ఎన్. రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు కారన్న, పెద్ద ఈరన్న, నెట్టి కంటయ్య, మండల సహాయ కార్యదర్శి జోహారాపురం కాశీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ ట్రస్ట్ ద్వారా నిరుపేద ఇంటర్ విద్యార్థికి భరోసా

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 17, ప్రభాతవార్త : ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్ గ్రామానికి చెందిన ఎ. స్వరూప, ఎ. దేవదాస్ దంపతుల కుమారుడు ఎ. రాజు కు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఉచిత విద్య వసతి కల్పించారు. బుధవారం ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు మాట్లాడుతూ ఎమ్మెల్యే డా. బివి. జయ నాగేశ్వర్ రెడ్డి సహాయ, సహకారం తో ఎన్ టి ఆర్ ట్రస్ట్ ద్వారా కర్నూలు శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఉచిత ఫీజ్ తో కూడిన ఉచిత హాస్టల్ వసతి ని కల్పించినందుకు హర్షం వ్యక్తం చేసిన విద్యార్థి తల్లిదండ్రులు అనంతరం ఎమ్మెల్యే బివి ని మున్సిపల్ కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలసి, శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో గుడికల్ గ్రామ 185 వ బూత్ కన్వీనర్ మాదన్న పాల్గొన్నారు.

వేగవంతంగా సాగుతున్న సర్, సర్వే..

చాగలమర్రి, జూన్ 17, ప్రభాతవార్త : మండల కేంద్రమైన చాగలమర్రి లోని పెద్ద మకానం వీధిలో ప్రత్యేక ఓటరు సవరణ జాబితా బుధవారం వేగవంతంగా సాగు తోంది. ఓటర్ జాబితాలోని వ్యక్తులను గుర్తించి, ఓటర్ జాబితాలో లేని స్థాని కేతరులను గుర్తించడం జరు గుతుంది. భారత ప్రభుత్వ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సర్ సర్వే ఇంటింటా చేస్తున్నామని బూత్ లెవెల్ అధికారి ఇమామ్ హుస్సేన్ తెలిపారు. ఓటు కొరకు దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను తీసుకోవడం జరిగింది.

మహిళలపై ఎవరైనా దురుసుగా ప్రవర్తించిన 112, 100 కాల్ చేయండి

డోన్, జూన్ 17, ప్రభాతవార్త : మహిళలు ముఖ్యంగా సైబర్ నేరముల గురించి తెలుసుకోవాలని ఎస్సై శరత్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు డోంట్ సబ్ డివిజన్ లో శక్తి టీం ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని రామాలయం దగ్గర మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా ఏ మహిళకైనా నీ ఫోన్లో ద్వారా అమౌంట్ కట్ అయినా ఎవరైనా ఓటిపి చెప్పండి అని అడిగిన కూడా మీరు చెప్పిన వారు ఎవరు పూర్తిగా గమనించి చెప్పవలసి ఉంటుందని ఇది ప్రతి మహిళ తెలుసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు అదేవిధంగా బాల్యవివాహాలు చేయడం నేరమని అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 కి ఫోన్ చేసి సమాచారం అందించాలని అదేవిధంగా బాల్య వివాహాలు చేసినచో 1098కి ఫోన్ చేసి సమాచారం తెలపాలని మహిళలకు సూచించారు. ఏపీకే ఫైల్స్ మరియు ఫేక్ మెసేజెస్ వచ్చినచో వాటిని ఓపెన్ చేయరాదని తెలిపారు. మహిళ పోలీసులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కర్నూలు, హాస్పిటల్, జూన్ 17, ప్రభాతవార్త : కర్నూలు మెడికల్ కళాశాల ఆడిటోరియంలో పట్టణ వార్డు ఆరోగ్య కార్యకర్తలకు పల్స్ పోలియో కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డా. ఉమా మాట్లాడుతూ ఈ నెల 28న జరిగే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రజా ఆరోగ్య అధికారి డా. రఘు మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని, కేంద్రాలకు రాని పిల్లలకు ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ప్రాంతీయ భేదాలు వీడి క్రీడా స్ఫూర్తితో రాణించాలి

: అంతర్ పాఠశాలల హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం..

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 17, ప్రభాతవార్త : క్రీడాకారులు ప్రాంతీయ భేదాలు,విభేదాలు పక్కనపెట్టి స్నేహభావంతో పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలని డాక్టర్ వాసిరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా ఒలంపిక్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో అంతర్ పాఠశాలల హ్యాండ్‌బాల్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా ఒలంపిక్ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగరత్నమయ్య,కార్యదర్శి శ్రీనివాసులు,. ఒలంపిక్ సంఘం సభ్యులు సునీల్ కుమార్, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి డాక్టర్ రుద్ర రెడ్డితో కలిసి డా.వాసిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.వాసిరెడ్డి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 20 బాల బాలికల జట్లు ఈ పోటీల్లో తలబడనున్నాయి. గెలపొందిన విజేతలకు ఈ 23 న జరిగే ఒలంపిక్ డే ను సందర్భంగా బహుమతుల తో పాటు ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్లేయర్ మాధవరావు, హ్యాండ్ బాల్ కోచ్ ప్రభాకర్, పలు పాఠశాలల పి.ఈ.టీ.లు పాల్గొన్నారు.

మునిసిపల్ కాంట్రాక్టర్ రంగన్న పై దాడి హేయమైన చర్య



కర్నూలు సిటీ, జూన్ 17, ప్రభాతవార్త : కర్నూలు జిల్లా కేంద్రంలో శ్రీరాంనగర్ లో రోడ్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ కురువ రంగన్నపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కే రంగస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు పెద్దపాడు ధనుంజయ, కోశాధికారి కె. సి. నాగన్న, జిల్లా సహాయ కార్యదర్శి బి. సి. తిరుపాల్, నగర అధ్యక్షులు తవుడు శ్రీనివాసులు, కార్యదర్శి బి. రామకృష్ణ, కె. వెంకటేశ్వర్లు, కె.హరిదాసు, ఓ. పుల్లన్న డిమాండ్ చేశారు. నిజాయితీగా పనులు చేస్తున్న కురువ రంగన్న పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అభివృద్ధి పనులు చేస్తున్న వ్యక్తుల పై దాడి చేసి గవర్నమెంట్ కు చెడ్డ పేరు తేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా కురువ సంఘం నాయకులు రంగన్నను పరామర్శించడానికి వెళ్లగా రంగన్న తమ గోడును వెల్లబోసుకున్నాడు. నేను 30 లెస్ తో శ్రీరామ్ నగర్ లో రోడ్డు పనులు చేస్తుండగా మాకు ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా నేను ఇవ్వనని చెప్పినందుకే నాపై దాడి చేశారని తన బాధను వ్యక్తపరిచాడు. ఈ జరిగిన విషయాన్ని బాధితుడు కర్నూలు మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకుల కూల్చివేత

: జనావాసాలకు ముప్పుగా మారడంతో చర్యలు..

బనగానపల్లె, జూన్ 17, ప్రభాతవార్త: మండల పరిధిలోని బనగానపల్లె పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం పరిసరాలు, టంగుటూరు, కొత్తపేట గ్రామాల్లో తాగునీటి అవసరాల కోసం ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉండటంతో సంబంధిత గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు బుధవారం వాటిని కూల్చివేశారు. నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను గుర్తించి కూల్చివేతకు ప్రతిపాదనలు పంపగా, అందిన ఉత్తర్వుల మేరకు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల ప్రకారం అధికారులు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం ఆయా ప్రాంతాల్లో ఉన్న ట్యాంకుల పిల్లర్లకు పేలుడు సామగ్రిని అమర్చి కూల్చివేశారు. ఈ సందర్భంగా గ్రామీణ నీటి సరఫరా శాఖ డివిజనల్ ఇంజినీర్ మధుసూదన్ మాట్లాడుతూ, సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన 40 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకులు గత 20 ఏళ్లుగా నిరుపయోగంగా ఉండి, ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదకర స్థితిలో ఉన్నాయని తెలిపారు. అవి అకస్మాత్తుగా కూలితే పరిసర ప్రాంతాల ప్రజలకు, జనావాసాలకు భారీ నష్టం సంభవించే అవకాశం ఉన్నందున మంత్రి ఆదేశాల మేరకు పేలుడు సామగ్రితో కూల్చివేసినట్లు వివరించారు. అవసరాన్ని బట్టి ఆయా ప్రాంతాల్లో నూతన ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాల పంపిణీ..

బనగానపల్లె, జూన్ 17, ప్రభాతవార్త: పట్టణంలోని కస్బా ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వై. సుంకన్న అధ్యక్షతన ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు జక్కుల విజయ రూ.2 వేల విలువైన నోటు పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లను విద్యార్థులకు అందజేశారు. ఐదు సంవత్సరాల వయస్సు పూర్తి చేసి ఒకటో తరగతిలో చేరే చిన్నారుల్లో విద్యపై ఆసక్తి పెంపొందించడంతో పాటు, వారు సంతోషంగా పాఠశాలకు వచ్చేలా ప్రోత్సహించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సమాజ సేవ చేయడానికి అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను క్రమశిక్షణ, నైతిక విలువలు కలిగిన భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడం పాఠశాల సిబ్బంది ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు కే. సత్యప్రకాశ్, ఉపాధ్యాయులు సయ్యద్ అబ్దుల్ కలీం, దర్గా ముంతాజ్, నీలి మహేశ్వరమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకులు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి

హొళగుంద, జూన్ 17, ప్రభాతవార్త; యువకులు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఎస్.కెంచప్ప, ఎంఎస్పీ మండల అధ్యక్షులు దేవప్ప పిలుపునిచ్చారు. మండలంలోని కోగిలతోట గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందాకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గో టూ విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఎస్.కెంచప్ప, ఎంఎస్పీ మండల అధ్యక్షులు దేవప్ప, ఎంఎస్పీ జిల్లా కమిటీ సభ్యులు పక్కిరప్ప, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు వెంకటేష్ పాల్గొని గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, ప్రతి కుటుంబం పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. యువతో నాయకత్వ లక్షణాలు పెంపొందితే సమాజాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. మహిళలు స్వయం ఉపాధి, పొదుపు సంఘాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా ఎదిగి కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జూలై 7న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా రెపరెపలాడే విధంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందాకృష్ణ మాదిగ ఉద్యమాన్ని ప్రారంభించి 32వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా రిజర్వేషన్ల ఫలాలు ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి చేరేలా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. విద్య, చైతన్యం, సంఘటిత శక్తి, సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా ప్రతి కార్యకర్త గ్రామస్థాయిలో పనిచేయాలని నాయకులు పేర్కొన్నారు. గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు మాలింగ, వీరేష్, చెన్నప్ప, శంకరప్ప, అరకాలప్ప, ఎంపీటీసీ రమేష్, యువకులు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే..

: పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపండి..

కోసిగి, జూన్ 17, ప్రభాతవార్త : అంగన్‌వాడీ కేంద్రాలకు తమ పిల్లలను పంపించి పోషకాలతో కూడిన ఆహారంతో పాటు చదువుకు అవసరమైన పునాదివేసేందుకు ప్రతి తల్లి తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మిబాయిఅన్నారు.. బుధవారం కోసిగి పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సంబందించి మొదటి సెక్టర్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మిబాయి అధ్యక్షతన పిల్లలకు స్థానిక 5వ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు.. పిల్లలకు అంగన్‌వాడీకేంద్రం నుంచి ఆయా లబ్ధిదారులకు, వారి పిల్లలను సమావేశ పరిచి గత సంవత్సరంలో పిల్లలు అంగన్‌వాడీ కేంద్రంలోఏమి నేర్చుకున్నారో.. వారి పెరుగుదలకు ఎలా సహాయ పడింది.. అనే విషయం కోసం ఆయా పిల్లల యొక్క భవిష్యత్తుకుఉపయోగపడుతుందని సూపర్‌వైజర్ పిల్లల తల్లులతో మాట్లాడారు.. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రంలో చదివినచిన్నారులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించడం కోసం తల్లిదండ్రులు ఏ విధంగా చేర్పించాలో వారికి సలహాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వేచ్ఛా పూరితమైన విద్యను అందించడంతో పాటు గర్భంలో నుండి పిల్లలకు సేవలందిస్తూ పుట్టినప్పటి నుండి ఐదు సంవత్సరాల వరకు సేవలతో పాటు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల యొక్క ప్రాధాన్యతను తెలియజేసారు.. అనంతరం విద్యార్థులకు 1వ తరగతిలో అర్హత పొందిన పిల్లలకు ధ్రువపత్రాలను తల్లుల సమక్షంలో పాఠశాల హెడ్మాస్టర్ సంజన్న, నరసయ్యల నేతృత్వంలోఅందరికి అందించారు.. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హెప్సిబారాణి, పి.పద్మావతి, మద్దమ్మ, మణి, యు.పద్మావతి, రాములమ్మ, సువర్ణకుమారి, నాగరత్న, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

: అల్లర్లు, గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవు : చిప్పగిరి ఎస్సై సివి నరసింహులు



చిప్పగిరి, జూన్ 17, ప్రభాతవార్త : మండలంలోని ఆయా గ్రామాలలో మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, పీర్ల దేవుళ్లను కూర్చోబెట్టే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని చిప్పగిరి ఎస్సై సివి నరసింహులు సూచించారు. బుధవారం ఆయన చిప్పగిరిలోని పోలీస్ స్టేషన్ నందు విలేకరులతో మాట్లాడుతూ మతద్వేషాలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు కానీ, చర్యలు కానీ వ్యవహరించకుండా, పీర్ల దేవుళ్ల నిమజ్జనం వరకు శాంతియుతంగా వేడుకలను జరుపుకోవాలని పేర్కొన్నారు. మద్యం తాగి ఎవరు వేడుకలలో పాల్గొంటే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేడుకలను ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో ఎలాంటి అల్లర్లు, గొడవలు లేకుండా జరుపుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వేడుకలలో డిజె సౌండ్ సిస్టమ్స్ పూర్తిగా నిషేధించామని, రోడ్లపై అడ్డంకులు సృష్టించాలని చూడరాదని, ముఖ్యంగా అత్యవసర సేవలు వాహనాలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో గతంలో జరిగిన సంఘటన దృష్టిలో ఉంచుకొని, ఆ గ్రామ పెద్ద మనుషులు పోలీస్ స్టేషన్ కు వచ్చి రాతపూర్వకంగా ఎలాంటి గొడవలు, అల్లర్లు లేకుండా ఉంటామని హామీ ఇస్తేనే వేడుకలకు అనుమతిస్తామన్నారు. పోలీస్ సిబ్బంది జగదీష్, మురళి, రవి తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యా సంవత్సరానికి.. సమగ్ర ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి) : విద్యార్థులకు కూడా ఈ విద్యా సంవత్సరంనుంచి తప్పనిసరిగా అమలు చేయనున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ క్యాంపస్ మొత్తం వైఫై సదుపాయంతో అనుసంధానం చేసి, సిబ్బంది, విద్యార్థులందరికీ ప్రత్యేక లాగిన్ ఐడీలను అందించామని చెప్పారు. అన్ని విభాగాల్లో ఇంటరాక్టివ్ డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. లైఫ్ సైన్సెస్ విభాగాలైన బోటనీ, జువాలజీ, బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ కోర్సులకు సంబంధించిన ప్రయోగశాలల్లో అధునాతన పరికరాలు, అవసరమైన రసాయనాలను సమకూర్చామని తెలిపారు. దీంతో విద్యార్థులు, పరిశోధకులకు మెరుగైన అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు. అలాగే ఇంజినీరింగ్ కళాశాలలోని సివిల్, మెకానికల్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఇంగ్లీష్ విభాగాలకు అవసరమైన ల్యాబ్‌లను ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేశామని, పూర్తిస్థాయి ప్రయోగశాలల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని వైస్ ఛాన్సలర్ వివరించారు. **విమర్శలకు సమాధానాలు... ;** ఇటీవల వర్సిటీలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి. వెంకటబసవరావు కూడా స్పందించారు. నియమ నిబంధనలకు అనుగుణంగానే అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అలాంటి పరిస్థితుల్లో అవకతవకలకు అవకాశం లేదన్నారు. యూనివర్సిటీతో పాటు తమపై వ్యక్తిగతంగా బురదజల్లే ప్రయత్నాలు జరిగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఏ విధమైన విచారణకైనా తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్న ఆయన, క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ యూనివర్సిటీ ప్రతిష్ఠకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. పలుమార్లు అవకాశాలు ఇచ్చినప్పటికీ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఇద్దరు విద్యార్థులపై తప్పనిసరి పరిస్థితుల్లో చర్యలు తీసుకున్నామని తెలిపారు. హాస్టళ్ల నిర్వహణపై మాట్లాడుతూ, ప్రభుత్వం మంజూరు చేసే స్కాలర్‌షిప్‌కు మించి అయ్యే వ్యయాన్ని మాత్రమే విద్యార్థులు భరించాలని సూచించామని చెప్పారు. కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులు, నాన్‌బోర్డర్లను యూనివర్సిటీ క్యాంపస్ లేదా హాస్టళ్లలోకి అనుమతించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. డీఓఏలో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన కేసు విచారణ తుదిదశలో ఉన్నందున ఆ అంశంపై ప్రస్తుతం వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు. కొన్ని బి.ఎడ్. కళాశాలల తనిఖీలకు ప్రతి సంవత్సరం ఒకే కమిటీలను పంపుతున్నారనే ఆరోపణలను ఆయన ఖండించారు. గతంలో తనిఖీలు చేసిన సభ్యులకు ఆయా కళాశాలల లోటుపాట్లు, వాటి సవరణలపై స్పష్టమైన అవగాహన ఉంటుందని, అందుకే కొన్నిసార్లు అదే కమిటీలను మళ్లీ పంపుతున్నామని వివరించారు. త్వరలోనే పరీక్షల విభాగాన్ని పాత లైబ్రరీ భవనానికి తరలించనున్నట్లు తెలిపారు. **వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి. విజయకుమార్ నాయుడు, :** రూసా నిధుల కింద చేపట్టిన పనుల విషయంలో చేస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా నిరాధారమని స్పష్టం చేశారు. రూసా నిధుల వినియోగానికి సంబంధించిన విధివిధానాలపై అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వర్సిటీలో రూసా నిధులతో చేపట్టే అన్ని సివిల్ పనులను ఏపీఈడబ్ల్యూఐడిసి ద్వారానే నిర్వహిస్తారని తెలిపారు. టెండర్ల ప్రక్రియ నుంచి కాంట్రాక్టర్ల ఎంపిక వరకు మొత్తం వ్యవహారాన్ని ఆ సంస్థే చూసుకుంటుందని, ఇందులో వర్సిటీ అధికారులకు ఎటువంటి ప్రత్యక్ష పాత్ర ఉండదన్నారు. పరికరాల కొనుగోలులో కూడా ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో టెండర్లు నిర్వహించి, టెక్నికల్ కమిటీ ఆమోదం పొందిన తర్వాత మాత్రమే వాటిని వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేస్తారని తెలిపారు. అనంతరం బిల్లుల ప్రాసెసింగ్ వివిధ విభాగాల పరిశీలన తర్వాత నిబంధనల ప్రకారమే జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా నాల్గవ కాన్వకేషన్ సందర్భంగా యూనివర్సిటీలో పలు అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అడ్మినిస్ట్రేషన్ భవనం వద్ద గార్డెన్ ఏర్పాటు, వీసీ కాన్ఫరెన్స్ హాల్ పునరుద్ధరణ, యూనివర్సిటీ ప్రాంగణం మరియు రోడ్ డివైడర్లకు రంగులు వేయడం వంటి పనులు నిర్వహించామన్నారు. ఇవన్నీ క్యాంపస్ సుందరీకరణకు సంబంధించిన పనులే కావడంతో కొంత అధిక వ్యయం జరిగిన విషయం వాస్తవమేనని పేర్కొన్నారు. విద్యాసంబంధిత వాతావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ దిశగా చేపడుతున్న చర్యలు, వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయడానికే ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు వివరించారు. ఈ సమావేశంలో వర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య సి. విశ్వనాథరెడ్డి, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.వి. సుందరానంద్, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య సి.వి. కృష్ణారెడ్డి, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్. నరసింహులు, ఆచార్య ఆర్. భరత్ కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, వర్సిటీ పీఆర్‌వోలు డాక్టర్ వి. రవిశంకర్, ఎస్. నాగభూషణం పాల్గొన్నారు.

చౌకగా కొట్టేసి..చాటుగా.. దాచేసి..!

(మొదటి పేజీ తరువాయి) : ఆయా శాఖల అధికారులు చర్యలు శూన్యం. అక్రమ రేషన్ బియ్యం పట్టివేత..!విజిలెన్స్ అధికారికి రాబడిన సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వై.పవన్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్స్ కే.ప్రతాపరెడ్డి, ఎం.అశోక్ కుమార్ లు స్థానిక రెవెన్యూ ఇన్చార్జి ఆర్ఐ హాఫీస్ తో కలిసి ఎమ్మిగనూరు పట్టణంకు చెందిన ఎస్.మహబూబ్ బాషాకు చెందిన స్థానిక మునెప్ప నగర్ లోని ఒక రేకుల షెడ్డులో అక్రమ బియ్యం నిల్వ చేసి ఉండగా అక్కడే ఉన్న ఏపి 04 టిడబ్ల్యూ 6760 రిజిస్ట్రేషన్ నెంబర్ గల ఆటోలో సుమారు 50 కేజీల బరువు గల 56 పిడిఎస్ బియ్యం ప్యాకెట్లను పంచనామ ద్వారా సీజ్ చేసి ఎంఎల్ఎస్ పాయింట్ నందు స్టాక్ ను అప్పగించారు. అనంతరం స్థానిక ఆర్ఐ హాఫీస్ తదుపరి చర్యల నిమిత్తము సీజ్ చేసిన ఆటోను అలాగే నేరస్తుడైన ఎస్.మహబూబ్ బాషాను స్థానిక ఎమ్మిగనూరు పట్టణ పోలీస్ స్టేషన్ నందు అప్పగించి ఫిర్యాదు నివేదించారు. అయినా తమ అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం దందా కొనసాగుతుందనే విమర్శలున్నాయి. **బియ్యం సేకరణకు నెట్వర్క్..! :** రేషన్ బియ్యాన్ని భారీ స్థాయిలో సేకరించేందుకు మాఫియా (ఎరుకల కులస్తులను) ప్రత్యేక సిబ్బందిని నియమించుకుంది. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నెట్వర్క్ విస్తరించింది. సేకరించిన చౌక బియ్యాన్ని ఎక్కడికక్కడ రహస్యంగా గోడౌన్లలో నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి లారీలు, బొలెరోల ద్వారా ప్రైవేటు వ్యాపారులకు, రైస్ మిల్లులకు కిలో రూ.15 చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. మిల్లర్లు రేషన్ బియ్యాన్ని మరోసారి మర పట్టించి, పాలిష్ చేసి..వాటినే బ్రాండెడ్ బియ్యంగా బహిరంగ మార్కెట్లో కిలో రూ.40 నుంచి 50 వరకు అమ్ముకుంటున్నట్లు తెలుస్తుంది. ప్రతినెలా వేల టన్నులకు పైగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. **వ్యాపారంగా మారిన దందా..! :** ఎమ్మిగనూరు నియోజకవర్గంలో కొందరు రేషన్ బియ్యం దందాను ఒక వ్యాపారంగా మార్చుకున్నారు. లబ్ధిదారుల నుంచి ఉచిత బియ్యం సేకరణకు అక్రమార్కులు గ్రామాల్లో ఏకంగా ఏజెంట్లనే నియమించుకుంటున్నారు. సేకరించిన బియ్యాన్ని రహస్య ప్రాంతాల్లో నిల్వచేసి అదనుచూసి పోలీసులు, పౌరసరఫరాల అధికారుల కళ్లు కప్పి లారీలు, వ్యాన్లలో తరలిస్తున్నారు. మహారాష్ట్రలో మన బియ్యానికి మంచి డిమాండ్ ఉంది. రూ.25 వరకు ధర పలుకుతోందని సమాచారం. గ్రామాలు, పట్టణాల్లో రేషన్ కార్డుదారుల నుంచి కిలోకు తక్కువ ధరకు కొని లారీలకు లారీలు రాత్రికి రాత్రే సరిహద్దులు దాటిస్తున్నారు. ఒక లారీ లోడు బియ్యాన్ని ఆవతల వైపు దాటిస్తే రూ లక్షలు వచ్చినట్లే. పెద్ద మొత్తంలో జేబులు నిండుతుండడంతో వారు దీనిని బంగారు గుడ్లు పెట్టే బాతులా భావిస్తున్నారు. ఇప్పటికైనా విజిలెన్స్, స్థానిక రెవెన్యూ, పోలీసు శాఖాధికారులు స్పందించి అక్రమ రేషన్ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

వ్యవసాయరంగంలో.. రాణించాలి

(మొదటి పేజీ తరువాయి) : యూరియాతో పాటు లింక్ పెడుతూ ఇతర ఎరువులను బలవంతంగా కొను గోలు చేయాలని ఒత్తిడి తేవడం, లింక్ సేల్స్‌కు పాల్పడడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి షాపు డీలర్‌ను ఆదేశించారు. మండలకేంద్రమైన దేవనకొండలోని మన గ్రోమోర్ యూరియా షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తమ పంట అవసరాలకు అవసరమైన ఎరువులను మాత్రమే కొనుగోలు చేయాలని, యూరియా కొనుగో లుకు లింక్ ఎరువుల కొనుగోలు తప్పనిసరి కాదని స్పష్టం చేశారు. యూరియాతో పాటు ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రోత్సమించినా, బలవంతపరిచినా సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని సాధ్యమైనంత మేర తగ్గించి ప్రకృతి వ్యవసాయం మరియు స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్స హించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా యూరియా లేదా ఇతర ఎరువుల విక్రయాల్లో లింక్ సేల్స్, అదనపు కొనుగోళ్లకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నట్లయితే 155251 మరియు 8341302863 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ రైతులకు సూచించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడంలో విఫలమైన బండగట్టు, కుంకనూరు, ఆర్ఎస్‌సే సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఏపీఐఎంఎస్ యాప్ ద్వారా రైతుల వివరాలను ఏ విధంగా నమోదు చేస్తున్నారని కలెక్టర్‌స్వయంగా పరిశీలించారు. రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ విత్తన షాపు డీలర్లను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, తహసీల్దార్ రామేశ్వరరెడ్డి, వ్యవసాయ అధికారి ఉషారాణి, ఎంపీడీఓ జ్యోతి, డిప్యూటీ ఎంపీడీఓ గోపాల్, ఆర్ఐ విజయభాస్కర్, జీఎస్‌డబ్ల్యూఎస్ రఫీ, పంచాయతీ కార్యదర్శి రాముడు, వీఆర్వో రాజన్న తదితరులు పాల్గొన్నారు.

టీసీల కోసం..తల్లిదండ్రుల కన్నీరు..!

(మొదటి పేజీ తరువాయి) : జారీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యార్థుల చదువులుసైతం దెబ్బతింటున్నాయని వారు వాపోతున్నారు. మరి కొంత మంది విద్యార్థుల పేర్లను ఆన్‌లైన్ నమోదు నుంచి తొలగించక పోవడంతో ఇతర పాఠశాలలో ప్రవేశాలు పొందడంలో తీవ్ర అవరోదాలు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాలల చుట్టు తిరుగుతూ మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొందని మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా వ్యాపార దాహంతో పుస్తకాలు యూనిఫాంలు తమ వద్దే కొనాలంటూ తల్లిదండ్రులపై పాఠశాల యాజమాన్యం నిరంకుశంగా ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యా ప్రమాణాలు పాతాళానికి పడిపోతుంటే విద్యను వ్యాపారంగా మార్చి లాభాల వేటలో పడి ఆకర్షణీయమైన మాటలతో తల్లిదండ్రుల అవసరాలను అవకాశంగా మలుచుకొని పాఠశాల ప్రాంగణాలే వ్యాపారాలుగా మార్చుకొని అక్షర ద్రోహానికి పాల్పడుతున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఫీజుల దోపిడిపై ఇప్పటికైన విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

సర్ పై డోర్ టూ డోర్ బిఎల్వోలు సర్వే

చిప్పగిరి, జూన్ 17, ప్రభాతవార్త : మండల కేంద్రమైన చిప్పగిరిలో క్లస్టర్ 04 నందు సర్ పై డోర్ టూ డోర్ కార్యక్రమంను బుధవారం క్లస్టర్ నెంబర్ 4, ఇంచార్జ్ ప్రభాకర్ సందర్శించారు. అర్హులైన వారందరినీ ఓటర్ జాబితాలో ఉండేలా పకడ్బందీగా చేపట్టాలని గ్రామంలో బూత్ నెంబర్ 144, బిఎల్ఓ పీఎం.గోవిందప్ప, జిఎస్.శ్రీకాంత్ ,బిఎల్ ఏ లకు సూచించారు. ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు బూతులలో బూత్ కన్వీనర్లని,యూనిట్ ఇన్చార్జీలను కలిసి గ్రామంలో ఎవరైనా 18 సంవత్సరాలు నిండిన వారు ఉంటే వారిని ఫారం 6 తీసుకొని వారి ఆధార్ కార్డు,రేషన్ కార్డు,ఫోటో,తీసుకొని బిఎల్ఓ లకు ఇచ్చి కొత్తగా వీరిని ఓటర్ జాబితాలో చేర్చాలన్నారు.పాత ఓటర్ లిస్టుతో,కొత్త ఓటర్ లీస్టు జాగ్రత్తగా మాపింగ్ చేయాలని కోరారు.

రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటలు వేసుకోవాలి

– వ్యవసాయ అధికారి సుమతి

రుద్రవరం, జూన్ 17, ప్రభాతవార్తః మండలంలోని అన్నిగ్రామాల్లోని రైతులు వాతావరణానికి అనుకూలంగా పంటలు వేసుకోవాలని వ్యవసాయ అధికారి సుమతి తెలిపారు. ఈసందర్భంగా గురువారం మండలంలోని శ్రీరంగాపురంలో ఖేత్ బచావో అభియాన్‌కు ఆరోగ్య పరిరక్షణపై ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం నంద్యాల ప్రిన్సిపల్ సైంటిస్టు వెంకటరమణ, జిల్లా వనరుల కేంద్రం నంద్యాల వ్యవసాయ సహాయ వ్యవసాయ సంచాలకులు చెన్నయ్య, ఆళ్లగడ్డ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు విజయశేఖర్‌ల అధ్యక్షతన రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్టు వెంకటరమణ మాట్లాడుతూ ఎల్‌నినో



ప్రభావం వల్ల ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం తక్కువగా నమోదు అవుతున్నందువల్ల దానికి అనుగుణంగా పంటలను మినుము, పెసర, సజ్జ, మొదలగు స్వల్పకాలిక తక్కువ నీటి వినియోగ పంట రకాలను సాగుచేసుకోవాలని రైతులకు తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం నంద్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు చెన్నయ్య మాట్లాడుతూ నేల ఆరోగ్యం, రసాయన ఎరువుల వినియోగం, తగ్గింపు అంతర పంటల మార్పిడి తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారి సుమతి మాట్లాడుతూ రుద్రవరం మండలంలో ఇప్పటి వరకు 700 క్వింటాల జీలుగలను రైతులకు పంపిణి చేశామని ఇంకా కావాల్సిన రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి తమపేర్లను నమోదుచేసుకోవాలని ఆమె కోరారు. కౌలు వ్యవసాయం చేసిన రైతులు తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డుకు ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు రవితేజ, శివకృష్ణ, దినేష్‌కుమార్, పంచాయితీ కార్యదర్శి పాములేటి, విఆర్వో అంకాలు, డీలర్ నరసింహారెడ్డి గ్రామ రైతులు పాల్గొన్నారు.

పగిడ్యాలలోని అంగన్వాడీకేంద్రంలో యోగా

పగిడ్యాల, జూన్ 17,ప్రభాతవార్త : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని బుధవారం అంగన్వాడీ మూడవ కేంద్రంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. కిశోరతల్లులు, లబ్ధిదారులతో కలిసి సామూహికంగా యోగాలో భాగంగా ఆసనాలు, వ్యాయామం చేశారు. అదేవిధంగా అంగన్వాడీ ఏడవ కేంద్రంలో యోగా చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ప్రభావతి, వరలక్ష్మి, సునీత, లక్ష్మిదేవి, హైమావతి. అమినాభి, భూషమ్మ, లక్ష్మి, కిశోర పిల్లల తల్లులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు వినతి

దేవనకొండ, జూన్ 17, ప్రభాతవార్త:

మండలంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని దేవనకొండకు బుధవారం వచ్చిన జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరిని సీపీఐ మండల ప్రతినిధి బృందం వినతి పత్రం అందించింది. సీపీఐ మండల కార్యదర్శి నరసారావు మాట్లాడుతూ మండల కేంద్రమైన దేవనకొండలో డీఎస్టీ హాస్టల్ పున: ప్రారంభం, మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని, కస్తూర్బా పాఠశాలకు సీసీ రహదారిని ఏర్పాటు చేయాలని, పీహెచ్‌సీకి ల్యాబ్ టెక్నీషియనన పోస్టును భర్తీ చేయాలని, రెగ్యులర్ ఫార్మాసిస్టును నియమించాలని, హంద్రీనీవా ప్రధాన కాలువకు గుడ్లకొండ దగ్గర సబ్ కెనాల్ ఏర్పాటు చేసి గుడిమిరాళ్ల, చెల్లెలచెలిమల, పి.కోటకొండ మీదుగా మాచాపురం చెరువుకు నీరు మళ్లించాలని కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు కందప్ప, సీపీఐ మండల నాయకులు రవి, భాస్కర్, నరేష్, మద్దిలేటి, రాజశేఖర్, హరి, తిమ్మప్ప పాల్గొన్నారు.

మనబడి మన భవిష్యత్ పనులను వేగవంతం చేయండి

– ఎంఈఓలు నాగభూషణం, రాఘున్న

మంత్రాలయం, జూన్ 17, ప్రభాతవార్త:

మంత్రాలయం మండలంలో ఉన్న వివిధ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న మనబడి మన భవిష్యత్ పనులను వేగవంతం చేయాలని మండల విద్యాధికారులు నాగభూషణం, రాఘున్నలు అన్నారు. బుధవారం మంత్రాలయంలో హెచ్ఎంల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించే విధంగా హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలు జరిగే సహించేది లేదన్నారు. గత ప్రభుత్వంలో చేసిన మనబడి నాడు నేడు పథకాన్ని ప్రభుత్వం మనబడి మన భవిష్యత్ కార్యక్రమంగా మార్చిందన్నారు. కావునా ఆయా పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు

క్రిష్ణగిరి,జూన్17,ప్రభాతవార్త : రైతులు ఆదునిక వ్యవసాయ పద్ధతులు అవలంభించి అధిక దిగుబడులు సాదించవచ్చున ని మండల వ్యవసాయ అదికారి మహేంద్ర అన్నారు.బుదవారం మండల పరిదిలోని టి. గోకులపాడు గ్రామంలో ఆత్మవారి సౌజన్యంతో రైతులకు పంటలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మేలు రకం విత్తనాలను విత్తుకోవాలన్నారు.పత్తి,ఆముదం,కంది పంటలను వేసుకోవాలన్నారు.ఎల్‌నినో పరిస్థితులు ఉన్నాయి కనుక రైతులు ఎరువులను సరియైన పద్దతుల్లో వేసుకోవాలన్నారు.సేంద్రియ ఎరువులను వేసుకోవాలన్నారు.రసాయనిక ఎరువులను పంటలపై పిచికారి చేయకూడదన్నారు.సేంద్రి య పద్దతుల్లో పిచికారి మందులు వాడాలన్నారు.ఏ.పి.ఏ.ఐ.యం.యస్ యాప్ ఉపయోగించుకోవాలన్నారు.దీని ద్వార సూచనలు,సలహాలు పొందవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అదికా రులు భీమ్లానాయక్,రైతులు తదితరులుపాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు

– ప్రముఖుల పిల్లలు ఏపీ మోడల్ స్కూల్స్‌లో చేరిక

రుద్రవరం, జూన్ 17, ప్రభాతవార్తః రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్న తీరును బట్టి పిల్లల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలను వదలి ప్రభుత్వ పాఠశాలలపై మొగ్గుచూపుతున్నారని రుద్రవరం ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సంగేపు నాగేశ్వర్ అన్నారు. ఈసందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం రుద్రవరం ఏపీ మోడల్ పాఠశాలలో నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, విలువల గల అధారిత బోధనలపై విశాస్వసం ఉంచి ప్రముఖులు తమ పిల్లలను మా పాఠశాలలో చేర్పిస్తున్నారన్నారు. ప్రభుత్వ వైదా ్యధికారి డా.ఉశేని, చైతన్యస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌లు తమ పిల్లలను 6వ తరగతి ప్రవేశానికి ఏపీ మోడల్‌పాఠశాల రుద్రవరంలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలలపై పిల్లల తల్లిదండ్రులు విశ్వాసం ఉంచి తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్పించడం అభినందనీయమని ఇది మా పాఠశాల యొక్క గొప్పతనమని విద్యాప్రమాణాలు, ఉపాధ్యాయుల కృషి విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమన్నారు. విద్యార్థులను మా పాఠశాల కుటుంబంలోకి ఆహ్వానిస్తు వారి ఉజ్వల భవిష్యత్తుకు అన్నివిధాల సహకరిస్తామని పిల్ల ల తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ సంగేపు నాగేశ్వర్‌రావు తెలిపారు.

బదిలిపై వెళ్లిన పోలీసులకు సన్మానం

క్రిష్ణగిరి,.జూన్17,ప్రభాతవార్త :మండల కేంద్రమైన క్రిష్ణగిరి పోలీస్‌స్టేషన్ నందు విధులు నిర్వహిస్తున్న అంజి,సూర్యప్రకాశ్, పాండురంగయ్య, శ్రీనులు పోలీసులు కర్నూలు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు బదిలి అయ్యారు.బదిలి అయిన సందర్భంగా వెల్దుర్తి యస్.ఐ యుగంధర్,క్రిష్ణగిరి యస్.ఐ క్రిష్ణ మూర్తి, వెల్దుర్తి యస్.ఐ నరేశు లు బుధవారం రోజు వీరికి దుశ్శాలువలు,పూలమాలతో సత్కరించారు. ఇక్కడ వీరు చేసిన సేవలను కొనియాడారు.వీరు పోలీస్‌శాఖలో మంచిగా పనిచేసి గుర్తింపు తెచ్చుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అకాక్షించారు.అధికారులు,పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

డా.బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఆహ్వానం

హోళగుంద, జూన్ 17, ప్రభాతవార్త:

మండలంలోని హెబ్బటం గ్రామంలో ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి హెబ్బటం గ్రామ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం టీడీపీ మండల ఈబీజీ గోవిందుగౌడ్‌ను ఆహ్వానించారు. మర్యాద పూర్వకంగా ఈబీజీ గోవిందుగౌడ్‌ని కలిసి కార్యక్రమాన్ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, సామాజిక సమానత్వం కోసం డా.బి.ఆర్.అంబేడ్కర్ చేసిన సేవలను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

పారిశుధ్య సిబ్బంది కిట్ల పంపిణి

వెలుగోడు,జూన్ 17,ప్రభాతవార్త:

మేజర్ గ్రామపంచాయితీ అయిన వెలుగోడులో పారిశుద్య కార్మీకులకు మరియు హరిత రాయబారులకు, వాటర్ వర్క్స్ సిబ్బందికి సంభంధించిన 2025 -2026 మార్చి వరకు ఇవ్వాల్సిన సబ్బులు, కొబ్బరి నూనె. మాస్క్‌లు వంటి కిట్లను బుధవారం గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారి ఎస్.స్వాతి, ఈవో మల్లి నరేంద్ర, క్లర్క్ కావ్యారెడ్డి పంపిణి చేశారు. ఈ సంధర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతు కార్మీకులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని, ప్రభుత్వం ఇస్తున్న కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సిబ్బంది, కార్మీకులు పాల్గొన్నారు.

84 రోజులకు చేరిన ముంపు భాధితుల రిలే దీక్షలు

నందికొట్కూరు,జూన్ 17,ప్రభాతవార్త: శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ కోసం ఆనాడు మా ఆస్తులు ధారపోశామని కాని ప్రభుత్వం తమను పట్టించుకోవడంలేదని నీటి ముంపు నిర్వాసితులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్తానిక ఎన్జీవో భవనం వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 84 రోజులకు చేరుకుంది. ఈ సంధర్భంగా సంఘం నాయకులు జయన్న మాట్లాడుతు నిర్వాసితులకు 98 జీవో ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలని ఆనాడు నందమూరి తారకరామారావు జీవో ఇచ్చారని అందులో పూర్తిగా న్యాయం జరగలేదని ఇంకా 250 మంది దాక మిగిలి ఉన్నారని, అందరికి ఉద్యోగవకాశాలు కల్పించిన ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడదని రిటైర్డ్ అయిన లష్కర్ల స్థానంలో వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ చేశారు. 84 రోజులుగా శాంతియుతంగా దీక్షలు చేస్తున్న నాయకులు పట్టించుకోవడంలేదని, మాకు అన్యాయం జరిగితే గత వైసిపి ప్రభుత్వానికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి పడుతుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రుడు, ధర్మరాజు, రామకృష్ణ, సుబ్బయ్య, నాగరాజు, సాహెబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు భూసారాన్ని పెంచే పద్ధతులు పాటించాలి

కొత్తపల్లి, జూన్ 17, ప్రభాతవార్తః రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి భూసారాన్ని పెంచే పద్ధతులు పాటించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాల శాస్త్రవేత్తలు డా.కె వెంకటరమణయ్య, డా.ఏ మల్లేశ్వర్‌రెడ్డిలు రైతులకు సూచించారు. బుధవారం వారు మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి అమిరున్నీసా బేగం ఆధ్వర ్యంలో ఖేత్ బచావో అభియాన్ భూ ఆరోగ్య రక్షణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చిరొట్టె ఎరువుపైన జనుము, జీలుగ లాంటి పంటలను పెంచి పూత దశలో పొలంలో కలియదున్నటం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. రైతులు భూసారాన్ని పెంచే పద్ధతులు పాటిస్తే నేల ఆరోగ్యం మెరుగుపడి తెగుళ్లు తగ్గి, నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. వేప సంబంధిత కషాయాలను పంట తొలిదశలో వాడడం వల్ల పురుగుల గుడ్లు లార్వదశలను నశింపచేయవచ్చని తెలిపారు. ఈసంవత ్సరం ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువ కురుస్తాయని తక్కువ నీటితో స్వల్పకాలిక పంటలను సాగుచేయాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

శ్రీసాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం

శ్రీశైలంప్రాజెక్టు, జూన్ 17, ప్రభాతవార్త : లోక కల్యాణం కొసం దేవస్థానం ఉదయం సాక్షిగణపతిస్వామివారికి విశేష అభిషేకం నిర్వహించింది. కాగా ప్రతి బుదువారం, సంకటహర చవితిరోజులు మరియు పౌర్ణమిరోజులలో శ్రీసాక్షిగణపతి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. ఈ ఉదయం సా క్షిగణపతి స్వామివారికి పంచామృతాలతోనూ, ఫలఫలోదాకాల తోనూ, హరిద్రోదకం, శుద్దజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పర్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి. కాగా వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. అదే విధంగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. కాగా చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తునట్లుగా దర్శనమిస్తాడు.

ప్రవైట్ విద్యా సంస్థల అధిక ఫీజుల దోపిడి అరికట్టాలి

నందికొట్కూరు,జూన్ 17,ప్రభాతవార్త: పట్టణంలోని ప్రైవేట్ విద్యా సంస్థల అధిక ఫీజులు, తమ వద్ద కొనాలని పుస్తకాలను అధిక రేట్లకు విక్రయిస్తున్న చైతన్య, నారాయణ, ఇతర ప్రైవేట్ పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్‌పిఎస్, ఆర్ఎస్ఎఫ్ యూనియన్ నాయకులు బి.శేఖర్‌నాయుడు, వేటూరి రంగస్వామి డిమాండ్ చేశారు. బుధవారం మండల విద్యాధికారిని కలిసి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.

అనంతరం వారు మాట్లాడుతు ప్రైవేట్ విద్యా సంస్థలు ఎల్కేజి నుండి పదవ తరగతి వరకు లక్షలాధి రూపాయల ఫీజులను వసూలు చేయడమే కాకుండా పాఠ్యపుస్తకాలు, యూనిఫారం పేరుతో అధనపు భారాన్ని మోపుతున్నారని, ప్రభుత్వ నిభంధనలకు వ్యతిరేకంగా ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, అలాగే గుర్తింపు లేని కార్పోరేట్ పాఠశాలలను తక్షణమే సీజ్ చేయాలని వారు కోరారు.

పశువుల ఆరోగ్య రక్షణకు టీకాలు వేయించండి

తుగ్గలి,జూన్ 17,ప్రభాతవార్త:

వర్షకాలంలో పశువులకు సోకే అంటువ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా పశువులకు టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి డాక్టర్.బాలకృష్ణ సూచించారు. బుధవారం మండల పరిధిలోని జొన్నగిరి గ్రామంలో పశువులకు చిటిక రోగం, నీలి నాలుక వ్యాధజ, జబ్బురోగం, దొమ్మురోగం, వంటి వ్యాధుల నివారణకు అవసరమైన టీకాల పశువులకు డాక్టర్ టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు పాడి రైతులు, జీవాల పెంపకందారులు తమ పశువులకు సకాలంలో టీకాలు వేయించి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టీకాల కోసం సమీప రైతు సేవా కేంద్రం లేదా పశు వైద్యశాలలో సిబ్బందిని సంద్రించాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పశుపోషకుల సంక్షేమం కోసం 50 శాతం రాయితీపై సమీకృత పశువుల దాణా పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. ఎస్టీ, ఎస్సీ సబ్‌ప్లాన్ నిదుల ద్వారా తొలి విడతలో ఎస్టీ ఎస్సీ పాడి రైతులకు రైతుసేవా కేంద్రాలు పశు వైద్యశాలల ద్వారా దాణాను అంధించనున్నారు. ఒక కిలో దాణాను రూ.11 చొప్పున 50 కిలోల దాణా సంచిని రూ.555కే రైతులు పొంద వచ్చునని అధికారులు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన పశు పోషకులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. మండలానికి 10 మెట్రిక్ టన్నుల దాణా కేటాయించగా అవసరమైన రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రం లేదా పశు వైద్యశాలలో సంప్రదించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తుగ్గలి,జూన్ 17,ప్రభాతవార్త: రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్దే ప్రభుత్వ ధ్యేయమని బీసీ సెల్ మండల అధ్యక్షుడు సంఘాల కృష్ణ, లక్ష్మణ్‌స్వామి, జయరాముడు, హోటల్‌మళ్ళీ అన్నారు. బుదవారం మండల పరిధిలోని జొన్నగిరి గ్రామంలో అగ్రికల్చర్ ఏవో సురేష్‌బాబు ఆధ్వర్యంలో వేరుశనగ విత్తనాల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు రైతులకు నాణ్యమైన విత్తనాలు అంధించడం ద్వారా పంటల ఉత్పాదకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయశాఖ సూచనలు పాటిస్తూ విత్తనాలను సక్రమంగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ఆధునిక సాగు పద్ధతులను అవలంభించిఅధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్ ను కలిసిన డా.కాకరవాడ

నందికొట్కూరు,జూన్ 17,ప్రభాతవార్త: మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో టిడిపి జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ నారా లోకేషను టిడిపి రాష్ట్ర నాయకులడాక్టర్.కాకరవాడ చిన్న వెంకటస్వామి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా ఆయన నియోజకవర్గంలోని నీటిపారుదల మరియు వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాల గురించి, మొక్కజొన్న, జొన్న, శెనగల కొనుగోళ్ళ విషయంలో రైతులను ఆదుకోవాలని కోరినట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో జరిగిన భూకబ్జాలపైన, రైతుల భూములను వైసిపి నాయకులు అధికారులు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేశారని, మరియు ఎన్నికల ముందు దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విషయంపై వైసిపి ప్రభుత్వం 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిందని వాటిని పునరుద్దరించాలని మరియు పార్టీ నిర్మాణంలో నామినేటెడ్ పదవుల విషయంలో దళితులకు ప్రాధాన్యత కల్పించాలని మంత్రి లోకేష్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. వీటిపై నారా లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

చిన్న సమూహం విజయానికి మార్గం

పత్తికొండ, జూన్ 17, ప్రభతవార్త : ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం ప్రాథమిక విద్య బలోపేతానికి చాలా కృషి చేస్తుంది. అందులో భాగంగా తల్లికి వందనం లాంటి పథకాల ప్రోత్సాహంతో పాటుగా విద్యార్థులకు వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు విషయాలను ఆహ్లాదకరంగా నేర్చుకునే విధంగాఖి సంసిద్ధత కార్యక్రమం ను అమలు పరుస్తోంది. ఇందులో భాగంగా పత్తికొండ పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో గల ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుడు మారుతి వారి తరగతివిద్యార్థులకు సంసిద్ధత అంశాలను జట్టు కృత్యంగా బోధిస్తున్నారు. వారు వారి తరగతి విద్యార్థులను చిన్నచిన్న సమూహాలుగా విభజించి బోధిస్తున్నారు. పాఠశాల స్థాయిలోఖి జట్టు కృత్యం ద్వారా విద్యార్థులలోఖి పరస్పర సహకార భావం ఖి, సమస్య పరిష్కార నైపుణ్యాలు అభివృద్ధి, ఒకరి మీద ఒకరికి గౌరవం, బాధ్యత, నాయకత్వ లక్షణాలు మెరుగుపడి విద్యార్థుల అభివృద్ధి వైపు పయనిస్తారు అని తెలియజేశారు.

నీట్ యూజీ 2026 రీఎగ్జామ్ విద్యార్థులకు ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం

బనగానపల్లె, జూన్ 17 ప్రభాతవార్త: నీట్ యూజీ-2026 రీఎగ్జామ్‌కు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కల్పించినట్లు బనగానపల్లె డిపో మేనేజర్ శశిభూషణ్ తెలిపారు. ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న నీట్ యు జి 2026 కు రీ ఎగ్జామ్ కు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్ టికెట్‌ను చూపించి, నివాస స్థలం నుంచి పరీక్షా కేంద్రానికి వెళ్లే ప్రయాణంతో పాటు పరీక్ష అనంతరం పరీక్షా కేంద్రం నుంచి తిరిగి నివాస స్థలానికి చేరుకునే ప్రయాణాన్ని కూడా ఉచితంగా చేయవచ్చని పేర్కొన్నారు. ఈ ఉచిత ప్రయాణ సదుపాయం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. నీట్ పరీక్ష రాయనున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలి

చిప్పగిరి, జూన్ 17, ప్రభాతవార్త: మండల కేంద్రం చిప్పగిరిలో బెల్దోన సొసైటీ బ్యాంక్ నందు రుణాలు పొందిన రైతులకు వాటిని సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పాటు అందించాలని బ్యాంక్ చైర్మన్ కొండా రామాంజనేయులు,సీఈవో హరికృష్ణ తెలిపారు.బుధవారం వారు మాట్లాడుతూ బెల్దోన సొసైటీ బ్యాంక్ పరిధిలో దాదాపు 24 కోట్లు రుణాలను రైతులకు ఇచ్చామని, ఇందులో 6 కోట్లు రుణాలు బకాయి ఉందన్నారు. కమర్షియల్ బ్యాంకులకు ఆదాయం అధికంగా ఉంటుందని,రైతులు కూడా అపోహతో రుణాల మాఫీ అయితాయన్న ఆశతో చాలామంది రైతులు సొసైటీ బ్యాంకులో రుణాలు చెల్లించకుండా మొండి బకాయిలుగా ఉంటున్నారన్నారు. అంతేకాక తీసుకున్న రుణాలకు అపరాధి వడ్డీ చెల్లిస్తూ నష్టపోతున్నారని వారు వివరించారు.కనుక రైతులు రుణాలను సకాలంలో చెల్లించి సొసైటీ బ్యాంక్ అభివృద్ధికి సహకారం అందించాలని వారు కోరారు.

చెత్త రహిత వీధులుగా మార్చడమే లక్ష్యం..

: చిప్పగిరిలో స్వచ్ఛ పథం

చిప్పగిరి, జూన్ 17, ప్రభాతవార్త:

గ్రామాలలోని వీధులను చెత్తరహితంగా మార్చడమే లక్ష్యమని చిప్పగిరి ఎంపీడీవో అల్లాబకాష్,డిప్యూటీ ఎంపీడీవోలు నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, ఏవో శ్రీనివాసులు అన్నారు. బుధవారం చిప్పగిరి గ్రామంలో స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి సిసింద్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అల్లాబకాష్ మాట్లాడుతూ ప్రతి బుధవారం ఆయా గ్రామ పంచాయితీలలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.చెత్త సేకరణ కోసం ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశామని,తడి పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు.ఇందులో భాగంగా రోడ్లకు ఉన్న చెత్తకుప్పలను తొలగించినట్లు చెప్పారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో చెత్త చెదారం తొలగించి, పారిశుద్ధ్య పనులను చేపట్టి బ్లీచింగ్ పౌడర్ చల్లి వీధులను శుభ్రం చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని, ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వారు వివరించారు.

04 page 18_04 page 18.qxd 17-06-2026 PM 10:39 Page 1

టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి..

దూదేకొండలో నిర్మాణ దశలో ఉన్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్..

పత్తికొండ జూన్ 17 ప్రభాతవార్త:
టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి రెండు నెలల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.బుధవారం పత్తికొండ మండలం దూదేకొండ గ్రామ సమీపంలోని కనకదిన్నె ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. యూనిట్‌లో కొనసాగుతున్న సివిల్ పనులు, యంత్రాల ఏర్పాట్లు, మౌలిక వసతుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పంటలకు విలువ ఆధారిత ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో గత ఏడాది ఈ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. యూనిట్‌కు సంబంధించిన ప్రాథమిక, ద్వితీయ ప్రాసెసింగ్ విభాగాల సివిల్ పనులు పూర్తయ్యాయని, యంత్రాల కొనుగోలు కోసం ఇప్పటికే వర్క్ ఆర్డర్లు జారీ చేసినట్లు వెల్లడించారు. మరో రెండు నెలల్లో యంత్రాల ఏర్పాటు పూర్తయ్యి ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్‌లో ప్రధానంగా టమోటా కెచప్, టమోటా పల్ప్, టమోటా సాస్ తయారీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. టమోటా సీజన్ ముగిసిన అనంతరం మామిడి, అరటి, జామ వంటి పండ్ల ప్రాసెసింగ్‌కు అనుగుణంగా యూనిట్‌ను పని చేస్తుందని తెలిపారు. టమోటా ధరలు పడిపోవడం వల్ల రైతులు నష్టపోయే పరిస్థితులు తరచూ ఎదురవుతున్నాయని, అలాంటి సందర్భాల్లో రైతుల నుంచి టమోటాలను కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేయడం ద్వారా వారికి గిట్టుబాటు ధర లభించేలా ఈ యూనిట్ కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రాసెసింగ్ అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాంత రైతులు ఆయా రకాల సాగుపై దృష్టి సారిస్తున్నారని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా టమోటా రైతులకు మార్కెట్ ఒడిదుడుకుల నుంచి రక్షణ కల్పించడంతో పాటు విలువ ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంపొందించడం సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసి యూనిట్‌ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, తహసీల్దార్ రామేశ్వర రెడ్డి, ఏపీఎంఐపీడీ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే ఏపీ సమగ్రాభివృద్ధి : బీజేపీ జిల్లా అధ్యక్షుడు

: రెండేళ్లలో రూ.14 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు
నంద్యాల జూన్ 17 ప్రభాతవార్త ప్రతినిధి:

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారం, భారీ నిధులతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రత్యేక అభివృద్ధి సాధ్యమవుతోందని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ ప్రాంగణంలో ఘనంగా విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సభకు జిల్లా వ్యాప్తంగా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ.. గత రెండేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రగతికి అత్యంత ప్రాధాన్యతనిచ్చిందని కొనియాడారు. కేవలం రెండేళ్ల వ్యవధిలోనే రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు వచ్చాయని ఆయన వెల్లడించారు. పోలవరం, రాజధానికి రికార్డు స్థాయి నిధులు రాష్ట్ర సమగ్ర వికాసానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని మధు పేర్కొన్నారు. కేంద్రం అందించిన సహకారాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను కూటమి పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అభిరుచి మధు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధించడమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో, సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతున్నాయి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత పారదర్శక పాలన అందిస్తామని తెలిపారు.

సభకు తరలివచ్చిన నేతలు, అధికారులు
జనసంద్రంగా మారిన ఈ విజయోత్సవ సభకు జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రులు, శాసనసభ్యులు కూటమి పార్టీల ముఖ్య నేతలతో పాటు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతదితర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ప్రభుత్వ విజయాలను ప్రతిబింబించేలా సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రచార ప్రదర్శనలు, ఫ్లెక్సీలు సభకు వచ్చే వారికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రూ.3.69 కోట్లతో నూతన భవనాలకు శంకుస్థాపన

- ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

వెలుగోడు, జూన్ 17, ప్రభాతవార్త:
వెలుగోడు పట్టణంలో రూ.3.69 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించే ప్రభుత్వ అతిథి గృహం, ఇంజనీరింగ్ కార్యాలయ భవన నిర్మాణాలకు శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పూజలు చేసి శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగుగంగ ఈఈ శివశంకర్‌రెడ్డి, ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, ఏఈలు ఇలియాస్‌ఖాన్, ఉదయ్‌కుమార్, శివనాయక్, పి.రాజశేఖర్, టిడిపి మండల కన్వీనర్ ముల్లా అబ్దుల్ కలాం, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఖలీల్‌ఖాన్, మాజీ ఎంపిపి ఎల్లాల కృష్ణుడు, డాక్టర్. జాకీర్ హుస్సేన్, రఘుస్వామిరెడ్డి, అమీర్‌పంజా, పట్టణ అధ్యక్షుడు మోమిన్ రసూల్, కార్యదర్శి శీలం వీరభద్రుడు, అబ్దుల్లాపురం బాషా, జె.ఇంతియాజ్, మాజీ ఎంపిటిసి రమణ, సర్ఫరాజ్ ఖాన్, సయ్యద్ జనసేన పార్టీ శాలుబాష, బిజెపి నాయకుడు పోతుల రాజశేఖర్‌రెడ్డి, తెలుగు గంగ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలిసిన వెల్దుర్తి మండల వైకాపా కన్వీనర్

వెల్దుర్తి, జూన్ 17, ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వెల్దుర్తి మండల వైకాపా కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ స్థితిగతులను మాజీ సీఎంకు రవిరెడ్డి వివరించారు. పత్తికొండ నియోజకవర్గం వైకాపా ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వైకాపా నాయకులు, కార్యకర్తలకు తాను అండగా ఉంటానని రవిరెడ్డి అన్నారు.

పట్టాల ప్రక్రియపై నంద్యాల ప్రజలలో అనుమానాలు

నంద్యాల మున్సిపాల్టి, జూన్ 17, ప్రభాతవార్త:
నంద్యాల మున్సిపాల్టి టౌన్ ప్లానింగ్ విభాగంలో డి-పట్టా, రిజిస్టర్ పట్టాల జారీ ప్రక్రియపై పట్టణ ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పట్టాల కోసం సామాన్యులు చేసుకున్న దరఖాస్తుల ఫైళ్ళు ముందుకు కదలడం లేదని, అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం పారదర్శకత కోసం ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చినప్పటికి క్షేత్రస్థాయిలో ఇలాంటి అపోహాలు, ఆరోపణలు రావడం పట్ల ప్రజా సంఘాలు ఆంధోళన వ్యక్తం చేస్తున్నాయి. పేద మధ్యతరగతి ప్రజలు సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఏళ్ళ తరబడి ఎదురుచూస్తుండగా ఈ ప్రచారం వారిని మరింత కలవర పెడుతుంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమీషనర్ స్వయంగా జోక్యం చేసుకోవాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టాల జారీ ప్రక్రియపై ప్రజలకు పూర్తి స్పష్టత ఇవ్వాలని, వస్తున్న ఆరోపణలపై పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు స్పంధిస్తేనే ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కుదురుతుందని వారు అభిప్రాయపడ్డారు.

రామాలయ ప్రతిష్టలో ప్రత్యేక పూజలు

మాండ్ర శివానందరెడ్డి

పాములపాడు, జూన్ 17, ప్రభాతవార్తః

పాములపాడు మండలం వేంపెంట గ్రామంలో గత మూడు రోజులుగా రామాలయ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తు న్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి హాజరయి ప్రతిష్ట మహోత్సవ పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకంటే ముందుగా రామాలయ చైర్మన్ టేకూరి రామసుబ్బమ్మ, యల్లమ్మ దేవత చైర్మన్ మోహన్ గౌడ్, సింగపూరు తెలుగు సమాజం అధ్యక్షులు టేకూరి నాగేశ్వర్‌రావు, సొసైటి చైర్మన్ లక్ష్మికాంతరెడ్డి, ఈవో లక్ష్మినారాయణలు శివానందరెడ్డికి ఘన స్వాగతం పలికారు. శివానందరెడ్డి గ్రామమంతా సుఖ సంతోషాలతో ఉండాలని, రైతులకు మంచి పంటలు రావాలని పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు తిమ్మారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, సీనియర్ నాయకులు హరినాథ్‌రెడ్డి, సొసైటి చైర్మన్‌లు గోవిందు, జనార్ధన్‌రెడ్డి, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, శివశంకర్ స్వామి, ఆర్ సురేష్, వరప్రసాద్, నాగేశ్వర్‌రావు, వినయ్‌కుమార్ వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బనగానపల్లెలో ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా మొహరం వేడుకలు

: మైనార్టీ లతో కలిసి పాదయాత్ర..
: ప్రత్యేక ప్రార్థనలు : మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి
బనగానపల్లె, జూన్ 17 ప్రభాత వార్త :

బనగానపల్లె పట్టణంలో మొహరం వేడుకలు ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి పట్టణంలోని ఆస్థానంలో బంగారు పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మరియు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి ఆస్థానం వరకు మైనార్టీ సోదరులతో కలిసి పాదయాత్రగా వెళ్లారు. అనంతరం నవాబు వారసుల ఆహ్వానం మేరకు ఆస్థానంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి చేతుల మీదుగా "పూల షేరా దట్టీ"ని సమర్పించారు. నవాబు వారసుల ఆధ్వర్యంలో సంప్రదాయ కార్యక్రమంప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో నవాబు వారసులు జనాబ్ మీర్ ఫజల్ అలీ ఖాన్ బంగారు పీర్లకు దట్టీలు కట్టి వేడుకలను ప్రారంభించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం నవాబు వారసులు, మైనార్టీ సోదరులతో కలిసి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆస్థానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బనగానపల్లె ప్రత్యేకతకు నిదర్శనం: మంత్రిఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలో ముంబై తర్వాత బనగానపల్లె లోనే మొహరం వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడతాయని అన్నారు. షియా మతస్తులతో పాటు ఇతర ముస్లింలు, హిందూముస్లింలు అనే భేదం లేకుండా పెద్ద సంఖ్యలో పాల్గొనడం బనగానపల్లె పట్టణ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అర్హులైన ఓట్లు తొలగిపోకుండా చూడాలి : ఎమ్మెల్యే విరుపాక్షి

దేవనకొండ, జూన్ 17, ప్రభాతవార్త;



వైసీపీ సానుభూతి ఓట్లు, అర్హులైన ఓట్లు తొలగిపోకుండా బీఎల్ఏలు చూడాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆదేశించారు. బుధవారం మండలంలోని అలారుదిన్నె, కుంకనూరు, కొత్తపేట, కరిడికొండ, వరిముక్కల, కూకటికొండ, వెలమకూరు, సింగాపురం, నల్లచెలిమల, ఎం.కె.కొట్టాల, గుండ్లకొండ గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలు, నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంలో ఓటర్ ధ్రువీకరణ పత్రాలను బీఎల్‌వోల ద్వారా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన చేస్తుందని, వైసీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగింపు యత్నాన్ని అడ్డుకోవాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చక అమరావతి అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయలను అప్పులు తెస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి వేసిందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ పెట్టుబడి సాయం కింద రైతు భరోసా ఇప్పటిదాకా జమ కాలేదన్నారు. వైసీపీ శ్రేణుల ఓటు బ్యాంకు సంరక్షించుకునే బాధ్యత తీసుకోవాలని వైసీపీ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ కిట్టు, వైసీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, కొత్తపేట బాబు, ఎర్రగోటి అంజి, రైతు మండలాధ్యక్షులు చాకలి శేఖర్, కూకటికొండ వీరేష్, వెలమకూరు దస్తగిరి, దేవేంద్ర పాల్గొన్నారు.

తుది మెరుగులు దిద్దిన తరువాతే బిల్లుల చెల్లింపు

- అభివృద్ధి పనుల్లో చివరిదశ పనులు పూర్తిచేయాల్సిందే
- నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు
కర్నూలు మున్సిపల్, జూన్ 17, ప్రభాతవార్తః

నగరంలో రహదారులు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన తుది దశ పనులను పూర్తిస్థాయిలో పూర్తిచేసి, నాణ్యత ప్రమాణాలను పాటించిన తరువాతే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా తుది మెరుగులు దిద్దడంతో పాటు ప్రజలకు ఉపయోగపడేవిధంగా పనులు పూర్తిచేయాలని సూచించారు. బుధవారం ఆయన టైపిస్టు కాలనీ, చంద్రశేఖర్ నగర్ ప్రాంతాల్లో ఇటీవల నిర్మించిన సీసీ రహదారులను పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ప్రధాన నిర్మాణ దశ పూర్తియిన వెంటనే బిల్లుల ప్రక్రియ చేపట్టడం సరికాదన్నారు. సిమెంటు రోడ్డులో మధ్యలోని జాయింట్‌లలో బిటు మినస్ జాయింట్ ఫిల్లర్ సీలెంట్ వేయడం, రోడ్డు-డ్రైనేజీ మధ్యనున్న బెర్మ్ భాగంలో గ్రావెల్ వేయడం వంటి తది దశ పనులను తప్పనిసరిగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈపనులు పూర్తియిన తరువాతే బిల్లుల ఫైళ్ళను తనవద్దకు తీసుకురావాలని సూచించారు. అంతకు ముందు జోహరాపురం, వెంకాయిపల్లి రహదారిలో డంప్‌యార్డులో బయోమైనింగ్ ద్వారా వెలువడిన జీర్ణమైన మట్టి ఇన్నర్ట్ వ్యవర్థాలతో చేపట్టిన రహదారి విస్తరణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బళ్లారి చౌరస్తా, చెన్నమ్మ సర్కిల్ ముజఫర్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చెన్నమ్మసర్కిల్, ముజఫర్ నగర్ ప్రాంతాల్లో ఇద్దరు దుకాణదారులు డస్ట్‌బిన్ ఏర్పాటుచేయకుండా రహదారిపై చెత్తచేదారం వేయడంతో వారికి జరిమాన విధించాలన్నారు. నగర స్వచ్ఛతకు ప్రజలందరు సహకరించాలని కమిషనర్ కోరారు. ఈకార్యక్రమంలో ఎంఈ మనోహర్‌రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జనార్ధన్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు వుశేన్, కుర్మయ్య, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్ల సుపరిపాలన విజయోత్సవ సభను ఘనంగా.. నిర్వహించుకుందాం

- మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, జూన్ 17, ప్రభాతవార్త;

కూటమి ప్రభుత్వ రెండేళ్ల సుపరిపాలన విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించుకుందామని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి పిలుపుని చ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఉదయం 10 గంటలకు మాధవరం టీడీపీ ఇన్‌చార్జి కార్యాలయం ఆవరణలో విజయోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు.

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకోవద్దు

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పాలకుర్తి తిక్కారెడ్డి విజ్ఞప్తి

మంత్రాలయం, జూన్ 17, ప్రభాతవార్త;

సీఎం చంద్రబాబునాయుడు రాయలసీమ ప్రాంతంలో చేపడుతున్న ఆర్‌డీఎస్, వేదావతి, గుండ్రేవుల ప్రాజెక్టులకు ప్రజలను దృష్టిలో పెట్టుకుని అడ్డు చెప్పొద్దని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. గత మంగళవారం కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కృష్ణా నది బోర్డు సభ్యుల సమావేశం కావడంతో టీడీపీ పార్టీ సీనియర్ నాయకులు, టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పాలకుర్తి తిక్కారెడ్డి మాట్లాడారు. రాయలసీమ ప్రాంతం అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, రాయలసీమ ప్రాంతంలో ఉన్న కరువు ప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకుని చేస్తున్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అటు తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వం వారు ఆర్‌డీఎస్, వేదావతి, గుండ్రేవుల ప్రాజెక్టులను అడ్డుకోవద్దని ఆయన కోరారు. మా కర్నూలు జిల్లా ప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకుని ఒక్కసారి ఆలోచించి మాకు సహకరించాలన్నారు.

ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

కొలిమిగుండ్ల, జూన్ 17, ప్రభాతవార్తః
మండల పరిధిలోని బెలుం సింగవరం గ్రామానికి చెందిన దొమ్మరి రామాంజి భార్య దొమ్మరి సులోచన (36) అనే బుధవారం తన ఇంట్లో ఉరివేసుకొని మరణించారు. వివరాల్లోకి వెళ్లితే మృతురాలి భర్త రామాంజి తాగుడుకు బానిసై కుటుంబ పోషణ పట్టించుకోకపోవడంతో సులోచనకు కుటుంబ పోషణ భారమై నానా ఇబ్బందులు పడుతూ జీవితంపై విరక్తిచెందిన ఆమె చనిపోవాలనే ఉద్దేశంతో ఇంట్లో దంతెకు చీరెతో ఉరివేసుకొని చనిపోయినట్లు మృతురాలి తల్లి దొమ్మరి లక్ష్మిదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు కొలిమిగుండ్ల ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసులు తెలిపారు.

డిజిటల్ వైద్య సేవలపై పీజీ విద్యార్థులకు అవగాహన

కర్నూలు హాస్పిటల్, జూన్ 17 ప్రభాతవార్త :
కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరి హాల్‌లో పీజీ వైద్య విద్యార్థులు మరియు డిపార్ట్మెంట్ వారీ నోడల్ ఆఫీసర్లకు "నెక్స్ట్ జెన్ ఈహాస్పిటల్" విధానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రోగుల వివరాలు, కేస్ షీట్లు, ల్యాబ్ రిపోర్టులను డిజిటలైజ్ చేయడం ద్వారా వైద్య సేవలను మరింత వేగవంతం, పారదర్శకంగా అందించవచ్చని వివరించారు. పీజీ విద్యార్థులు, నోడల్ ఆఫీసర్లు ఈహాస్పిటల్ వ్యవస్థపై పూర్తి అవగాహన పెంచుకుని రోగులకు నాణ్యమైన డిజిటల్ వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎంఓలు డా. సునీల్ ప్రశాంత్, డా. క్లింటన్, ఎన్ఐసి రోల్ అవుట్ మేనేజర్ జె. సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 5గురికి జైలు శిక్ష

ఆదోని రూరల్, జూన్ 17, ప్రభాతవార్త :
రోడ్డుపై మద్యం తాగి వాహనాలు నడిపితే అలాంటి వారికి జైలు శిక్ష తప్పదని ఆదోని తాలూకా సిఐ నల్లప్ప అన్నారు. బుధవారం సీఐ నల్లప్ప తెలిపిన వివరాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టు పడిన మన్సూర్(సింధనూర్), పెద్ద ఈరన్న (ఇంద్రనగర్), బాట రామకృష్ణ (నగరూర్ ఆస్పరి), సూరి పోగుల రాజు (సాంబగల్), సుంకన్న (ఇంద్రనగర్) అనే ఐదు మందికి స్పెషల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ జడ్జ్ వారికి నాలుగు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.. ఈ సందర్భంగా సీఐ నల్లప్ప మాట్లాడుతూ ఎవరైనా సరే తాగి వాహనాలు నడిపితే అలాంటి వారికి జైలు శిక్ష తప్పకుండా ఉంటుందని, అందుకే వాహనదారులు తాగి డ్రైవింగ్ చేయకూడదని ఆయన సూచించారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధమని, అలా ఎవరైనా తాగి దొరికితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. చాలామంది అత్యుత్సాహంతో రోడ్లపై కొచ్చి ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అలాగే గ్రామాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తే అలాంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఏసీబీ కేసులో రిమాండ్‌కు వెల్దుర్తి సెక్రటరీ

వెల్దుర్తి, జూన్ 17, ప్రభాతవార్త :
వెల్దుర్తి పట్టణానికి చెందిన సందెపోగు సతీష్ తన ఇంటి నిర్మాణానికి అనుమతులు మంజూరు కోసం వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నాథ్ కు రూ. 40 వేలు లంచం ఇస్తుండగా కర్నూలు ఏసీబీ డిఎస్పి సోమన్న ఆధ్వర్యంలో మంగళవారం వెల్దుర్తి సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న టీ స్టాల్ వద్ద వలపన్ని పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ కేసు కు సంబంధించి బుధవారం పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్ ను అరెస్టు చేసి కర్నూలు ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ 15 రోజులు రిమాండ్ కు ఆదేశించినట్లు ఏసీబీ డీఎస్పీ సోమన్న తెలిపారు. ఈ మేరకు ఇతనిని పంచలింగాలలోని జిల్లా జైలుకు తరలించామన్నారు.

మంత్రి నారా లోకేష్ ను కలిసిన ఐ టి డి పి గట్టు తిలక్

కర్నూల్ హాస్పిటల్ జూన్ 17 ప్రభాతవార్త

కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ ఐటీడీపీ జిల్లా అధ్యక్షులు గట్టు తిలక్ గారు రాష్ట్ర విద్య, ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి కర్నూలు జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, పరిశ్రమల ఏర్పాటు, విద్యా రంగ అభివృద్ధి, రహదారుల నిర్మాణం తదితర అంశాలపై చర్చించి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అలాగే ప్రతిపక్షంలో పార్టీ కోసం పనిచేసిన ఐటీడీపీ కార్యకర్తలకు తగిన గుర్తింపు, ప్రోత్సాహం కల్పించాలని విజ్ఞప్తి చేయగా, లోకేష్ గారు సానుకూలంగా స్పందించి సంబంధిత అంశాలను పరిశీలిస్తామని తెలిపారు

ప్రభుత్వ కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష

: నార్లాపురంలో స్వచ్ఛపథం కార్యక్రమం..
వెల్దుర్తి, జూన్ 17, ప్రభాతవార్త
స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో బుధవారం వెల్దుర్తి ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ, ఈసీ, టిఏలు, ఎఫ్ఏలు, సీనియర్ మేట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో జలధార జలహారతి పనులు, హార్టికల్చర్, ఎన్ఎంఎంఎస్, అక్షర ఆంధ్ర, యోగాంధ్ర మొదలైన వాటిపై ఎంపీడీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. అదేవిధంగా. స్వచ్ఛ పథం కార్యక్రమం మండలంలోని నార్లపురం గ్రామంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో చేపట్టారు. ఎంపీపీస్ పాఠశాల, అంగన్వాడీ సెంటర్ లను ఎంపీడీవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పిఎస్, హరితరాయబారులు తదితరులు పాల్గొన్నారు